


# రాగ ప్రస్తారం

*రివ్వుమంటూ వచ్చి సుళ్ళు తిరిగిన గాలికెరటం బజారులో నడిచేవాళ్ళ మొహాన ఇంత దుమ్మును కొట్టింది.*

క్రొత్తవూరు. క్రొత్త బజారు. క్రొత్త మొహాలు కావటంతో కళ్ళింత చేసుకుని బజారునంతా పరికిస్తూ పరీక్షిస్తూ నడుస్తున్న సారంగపాణి కళ్ళలో సన్నని దుమ్ము చిలకరించినట్లయింది. ఎక్కడి వాడక్కడే క్షణంసేపు ఆగి చేత్తో కళ్ళు నలుపుకుని మళ్ళీ నడక సాగించాడు. అతని నడకతోపాటు మనసుకూడా సాగింది.

కొన్ని యేళ్ళుగా బానిసత్వానికి అలవాటు పడ్డ వ్యక్తికి అయాచితంగా, అకస్మాత్తుగా సంపూర్ణ స్వేచ్ఛ లభిస్తే దానికి తట్టుకోలేడతను. నీటనుండి బయటికి విసరివేయబడిన చేపలాగా గిలగిల్లాడుతాడు. సారంగపాణి ఫక్తు అలాంటి కోవకు చెందినవాడు. రోజూ ఐదు గంటలకల్లా నిద్రలేచి కాలకృత్యాల్ని నిర్వర్తించుకుని వీణని ముందు పెట్టుకుని సాధన ప్రారంభించేవాడు. మంచి వైణికుడిగా పేరు ప్రఖ్యాతులు గడించినా, ఏ రాగమైనా ఎంతసేపైనా తడుముకోకుండా వాయించగలిగినా, ప్రతి నిత్యమూ ఆ సాధన మాత్రం మానడు. మరువడు సారంగపాణి. అతి కష్టమైన సున్నితమైన వాద్యం వీణ. ఏ రోజు కారోజు క్రొత్తగానే వుంటుంది. ఎప్పటి కప్పుడు క్రొత్త మెళకువలు ఆకళింపుకు వస్తూనే వుంటాయుంటాడు సారంగపాణి. అతని వయసు ముప్ఫయి వుంటుందంటారు ఆతన్నెరిగినవాళ్ళు. కాని పాతికేళ్ళవాడిలాగా కన్పిస్తాడు. చెప్పొచ్చేదేమంటే అలా వైణిక సాధనతో మొదలైన దినచర్య ఆ వైణిక సాధనతోనే అంతమౌతుంది. ఈ మధ్య కాలంలో నాలుగైదు పాఠాల్ని చెప్పుకుని కాలం వెళ్ళబుచ్చుతాడు. అవే అతని జీవనాధారం. తీరిక అనే పదం అతని నిఘంటువులో కనిపించదు. యాంత్రికమైన అలాంటి దినచర్యకు అలవడ్డ సారంగపాణి ఈ రోజు వైణికసాధన, చెప్పవలసిన పాఠాలుమాని క్రొత్తవూరిలో వీధులవెంట తిరుగుతూ ప్రొద్దుపుచ్చటం కష్టంగానేవుంది.


అవతలివేపున వున్న హోటల్లోనుండి చక్కని కర్ణాటక సంగీతాన్ని ప్రసారం చేస్తోంది రేడియో. మోహనరాగంలోని కృతి అప్పుడే ముగిసింది. గాయకుడు స్వరం వేస్తున్నాడు. స్వరం అవగానే ప్రక్క వాద్యాలు ఆ స్వరాన్ని పలికిస్తున్నాయి.

నాగస్వరానికి మంత్రముగ్ధమై తల వూపుతూ ఎక్కడిదక్కడ ఆగిపోయే జాతి సర్పంలా క్షణంసేపు నిల్చుండి పోయాడు సారంగపాణి. అది అతనికి ప్రియతమమైన రాగం. కొన్ని సంవత్సరాలు ప్రత్యేకంగా ఆ రాగంపై పరిశోధనజరిపి క్రొత్తసంగతులతో క్రొత్త పోకడలతో ఆ రాగాన్ని తీర్చి దిద్దాడు. తనవాద్యకచ్చేరీలో ఆ రాగాలాపన ఒక ప్రత్యేకాకర్షణ. తనవద్ద నేర్చుకునే శిష్యులకు సైతం ఆ రాగాన్ని ప్రత్యేకమైన శ్రద్ధతో ఆసక్తితో నేర్పేవాడు....అనుకోకుండానే అతను-రోడ్డుకడ్డంగా-ఆ హోటలు వేపు నడిచాడు.

చిన్నకారొకటి సర్రున మూలిగి సడెన్‌గా ఆగింది. మోహనరాగంపైపు పరుగులెత్తే మనసుకు కళ్ళెం బిగించినట్లయింది. ఎదురుగా చిన్నకారు కళ్ళకు కన్పించింది సారంగపాణికి. మొదట్లో తానా కారుకు అడ్డం పోయానేమోననిపించింది. కాని అలా జరుగలేదు. ఆకారే తనకు అడ్డంవచ్చింది. తనకు కారు అడ్డంరావటమేమిటి? తన భావన తనకే అబద్ధంగా తోచింది. అందుకని మరోవిధంగా సమాధ పర్చుకున్నాడు మనసును. ఆ కారుకూడా మోహనరాగం కోసం ఆగిందేమోనని.

అలా అనుకోటంలో సారంగపాణి పూర్తిగా పొరబడలేదనేచెప్పాలి. ఏమంటే అందులోంచి అంటే ఆనల్ల చిన్నకారులోంచి దిగిన ఆసామీ సంగీతాభిమాని అనీ, మోహనరాగ ప్రియుడని సారంగపాణికి తెలుసు. ఆయన పేరే బంగారయ్య. ఆయన చేతివ్రేళ్ళలో ఎనిమిదింటికి రంగురంగుల రాళ్ళుగల్ల ఉంగరాలున్నై. బొగ్గులోంచే మాణిక్యాలూ, మరకతాలూ పుట్టాయనే సత్యాన్ని రుజువు పరుస్తున్నాయా అన్నట్లుగా నల్లని దేహచ్ఛాయ కలిగిన బంగారయ్య చేతివ్రేళ్ళకు, చెవులకువున్న బంగారపు వస్తువులలోని విలువగలరాళ్ళు వింత కాంతుల్ని వెదజల్లుతున్నాయి.

విహారి & శాలివాహన



బంగారయ్య పేరుమోసిన బట్టలవ్యాపారి. ఆయనకు రెండువేపులా రెండు లకారా లున్నవనే వదంతికూడా లేకపోలేదు. తాను రెండు లకారాలతో వున్నానని బంగారయ్య నమ్మడు. ఎందుకంటే తానింకా గడిద్దామన్నే చూస్తున్నాడు. అంత కాంక్ష ఆయనకు, కాని ఒక్క సుగుణం. ఏ మాట కామాటే చెప్పుకోవాలి మరి. కాంతా కనకాలపైన కాంక్ష ఎవరి కుండదు గనుక ; అయితే ఆ కాంక్ష వున్న వాళ్ళందరూ బంగారయ్యలు కాలేరు. బంగారయ్యలో త్యాగబుద్ధి వుంది. లలితకళలను ఆదరించి అభినందించే గుణ సంపన్నతవుంది. ఉన్నదనే విషయాన్ని తెలుసుకుని నలుగురికి చాటిచెప్పిన ఘనత సారంగపాణికే దక్కుతుంది.

సంగీతమన్నా, అందునా మోహనరాగ మన్నా చెవి కోసుకునే బంగారయ్యకు సారంగపాణితో స్నేహం కుదరటంలో ఆశ్చర్యంలేదు. వ్యాపారం నిమిత్తం ఏదో వూరు పోయిన బంగారయ్య అక్కడ కచ్చేరీ చేస్తున్న సారంగపాణిని, అతను ఆలపించిన మోహనరాగాన్నిచూసి, విని వర్ణించనలవికాని ఆలౌకికానందాబ్ధిలో గ్రుంకులిడి, సారంగపాణిని సమీపించి. "మీ కుటుంబ భారాన్ని నా భుజాలమీద వేసుకుంటాను. మా వూరు వచ్చి. నాతోనే





వుంటూ రోజూ మాకు మోహనరాగాన్ని వినిపించాల్సింది" అని ప్రాధేయపడ్డాడు.

వెనుకటి రాజులు - సంస్థానాధీశ్వరులు కవులను, గాయకులను తమ ఆస్థానాల్లో వుంచుకుని పోషిస్తూ రసాస్వాదన చేసేవారని, ఈ రోజుల్లో ఆ కళలను ఆదరించే వాళ్ళుటుంచి, ఆలకించేవాళ్ళుకూడ కరువైనారని మనసులోనే క్రిగ్గుళ్ళే సారంగపాణికి బంగారయ్య అభ్యర్థన తా నిప్పు డెక్కడున్నాడనే సందేహం కల్గించింది. బంగారయ్య చూడకుండా చేతిని గిల్లి చూసుకుని, జరుగుతున్నది వాస్తవమేనని నిర్ధారించుకుని ఎంతో వినయంతో ఆనందంతో "సరే"నని ఒప్పుకున్నాడు.

అయితే ఒక్క సవరణను ప్రతిపాదించాడు సారంగపాణి. అతి సర్వత్రవర్జయేత్ అన్నారు శాస్త్రకారులు. పాత్ర అంచుల్ని పొంగిపొరలే అమృతమైనా, చెలియలికట్టను దాటే ప్రేమ సాగరాలైనా ఎప్పటికైనా ప్రమాదజనకాలేనని సారంగపాణికి తెలుసు. "నా కుటుంబ భారం అంతటినీ మీరు మోయటం బదులుగా మీకు ఒక్క మోహనరాగమే వినిపించటం ఏమంత సమంజసంగా లేదు. అందుకని మీ వూరిలోనే నాలుగైదు పాఠాలు కుదుర్చితే వాటితో పొట్టపోసుకుంటూ మీకు కావలసి నప్పుడల్లా నాకు చేతనైన ఈ వీణావాద్యాన్ని మీకు వినిపిస్తూ మీ అండను బ్రతుకుతాను" అని అన్నాడు. బంగారయ్య పరమానంద భరితుడై సారంగపాణితో యిల్లుచేరాడు.

సారంగపాణికి బంగారయ్యతోటి పరిచయం అలాంటిది.

బంగారయ్య నల్లనివాడే అయినా ఈరోజు ఆయన మొహం మరీ నల్లగా కనిపించింది సారంగపాణికి. బంగారయ్య ప్రక్కనే వున్న వ్యక్తి - ఎక్కడో చూచినట్లే గుర్తు. పోలికల్నిబట్టి చూస్తే బంగారయ్య బావ మరిదిలావుంది. బంగారయ్య ఒకసారి పరిచయం చేసినట్లుగా కూడ గుర్తు - ఆవ్యక్తి మొహం కందగడ్డలా కందివుంది. కళ్ళలో కోపమూ, క్రౌర్యమూ ఉట్టిపడుతున్నై. ఎందుకో ! ఎవరిమీదో ! !

సారంగపాణి చిరునవ్వుతో పలుకరించాడు బంగారయ్యనూ ఆ మరోవ్యక్తినీ.

'ఇక్కడున్నారేం మేష్టారూ ?' బంగారయ్య దీనస్వరంతో పలుకరించా గుంటూరు నూతిలో నుండి వచ్చినట్లుగా వుంది ఆస్వరం.

'నిన్న ఉదయమే వచ్చానండీ ఈవూరు, కొంచెం పనివుంది....'

'మీరు ఎప్పుడొచ్చిందీ మాకు తెలుసు. ఎందుకొచ్చిందీ తెలుసు మేష్టారూ !'. కోపాన్ని దిగమ్రింగుతున్న ధోరణిలో అన్నాడా మరోవ్యక్తి సారంగపాణిని మధ్యలో ఆపి.

సారంగపాణికి అంతా అయోమయంగా వుంది. తను ఎప్పుడు వచ్చిందీ, యెందుకు వచ్చిందీ ఆతగాడికి తెలియడమేమిటో, తన మీద ఈ అకారణకోప మేమిటో అంతుబట్ట లేదు. కాని ఇలా అన్నీ తెలుసునని దాంబికాలు పలికేవాళ్ళే చివరికి ఏమీ తెలియని వాళ్ళుగా నిరూపింపబడ్తారని అతని దృఢమైన నమ్మకమూ, అనుభవమూనూ. ఒకసారి ఎక్కడో జరిగిన చిన్న సంఘటన జ్ఞప్తికొచ్చింది.

తను వాద్యకచ్చేరీ చేస్తున్నాడు. పండితులూ, పామరులూ అందరూ విని ఆనందించే సంగీతం. వీణలాంటి సున్నితమైన వాద్యంమీద ఆ సంగీతం యింకా మనోహరంగానూ, శ్రావ్యంగానూ వినిపిస్తోంది. అందరూ వింటున్నారు. తలలు వూపుతున్నారు. తన వాద్యాన్ని అంతమంది విని ఆనందిస్తున్నారంటే అంతకంటేకావలసిందేముంది కళాకారునికి! మనసు పారవశ్యంతో నిండుతుంది. కించిత్తు గర్వంకూడా పొడసూపటం అపహాణంకాదేమో. అలాగే అనుభూతిని చెందాడు సారంగపాణి ఆనాడు. ఇంతలో శ్రోతలలో ఒకరివద్దనుండి ఒక చిన్నచీటీ వచ్చింది. ఆ చీటీని యెవరు పంపిందీ, అంచెలంచెలుగా యెలా వచ్చిందీ అంతా గమనిస్తూనే వున్నాడు సారంగపాణి. ఆ చీటీలో 'ఆనందభైరవి' రాగం వాయించమనే కోరిక వ్యక్తం చేయబడ్డది. ఆచీటీ పంపినవ్యక్తి మంచి డబ్బో, పలుకుబడి వున్నవాడిలా వుంది. వాటికితోడు సంగీత పరిజ్ఞానమేమైనా వుందా, లేక ఏమీ తెలియక పోయినా, తెలిసినట్లుగా నటిస్తూ, తల వూపుతూ, తన పరిజ్ఞానాన్ని గమనించం డోయ్! అన్నట్లుగా ఈరాగం వాయించు, ఆపాట వాయించు అని చీటీ పంపాడా తెలుసుకోవా లనిపించింది సారంగపాణికి. చిన్న వుపాయం తట్టింది, వెంటనే ఆనంద భైరవి కాకుండా మరోరాగం వాయించాడు. వైణికుడు తను కోరినరాగమే వాయిస్తున్నాడనుకున్న ఆశ్రోత మహదానందభరితుడై తలవూపి చప్పట్లు చరిచాడు. సారంగపాణికి నవ్వు వచ్చింది.

సన్నని నవ్వు పెదాలపై తళుక్కుమంది సారంగపాణికి.



"నవ్వేదువుగానిలే" అన్నాడు, బంగారయ్య ప్రక్కనున్న వ్యక్తి కోపంగాచూస్తూ.

"గోపాలం!" బంగారయ్య మందలింపుగా పిలిచాడా వ్యక్తిని.

అప్పు డనుకున్నాడు సారంగపాణి నిజంగానే ఏదో జరిగి వుంటుందని.

సారంగపాణి భుజంపై చేయి వేస్తూ "రండి మేష్టారూ!" అని కారువైపు దారితీశాడు బంగారయ్య. సారంగపాణి ఆలోచనా మనస్కుడై బంగారయ్యను అనుసరించి వెళ్ళి కారులో కూర్చున్నాడు మోహనరాగాన్ని మరచిపోయి. కారు కదిలింది మెల్లగా.

"ఎటు పోనీమంటారు?" డ్రైవరు ప్రశ్నించాడు బంగారయ్య నుద్దేశించి.

"ఎటువెళ్ళాలి మేష్టారూ?" బంగారయ్య సారంగపాణిని ప్రశ్నించాడు.

సారంగపాణి తడబడ్డాడు. ఎటువెళ్ళాలని తనని అడుగుతాడేమిటి? మాటా - మంతీ, మంచీ చెడ్డా చెప్పకుండానే తనని కారులోకి ఎందుకు ఎక్కించినట్లు? ఎక్కడికి వెళ్లాలి- ఎటు వెళ్లాలని తననే అడగట మేమిటి? సమాధానం దొరకలేదు.

బంగారయ్య కు సారంగపాణినుంచి సమాధానం రాలేదు. మళ్ళీ ప్రశ్నించా డాయన 'ఎక్కడ దిగారు?'

'దిగడమేమిటి?' అయోమయంగా ప్రశ్నించాడు సారంగపాణి.

'అదే బసచేయటం'

"నే నెక్కడా బస చేయలేదు. నా మిత్రుని కొడుకు ఒహడు కాలేజీలో చదువుతుంటే సంచీ అక్కడ పడేసి తిరుగు



తున్నాను. అనుకున్న పని ఒక్కటీ కాలేదు."

ఆశించిన సమాధానం సారంగపాణి నుండి రాకపోవటంతో బంగారయ్య కు విసుగు పుట్టింది. తాను పొరపడ్డున్నానేమో ననే అనుమానమూ వేసింది. అందుకనే అసలు విషయాన్ని కదిలించాడు. 'అమ్మాయి ఎక్కడుంది?'

'ఏ అమ్మాయి?' సారంగపాణి ఎదురు ప్రశ్న వేశాడు.

'నీవుతీసుకొచ్చిన అమ్మాయి' గోపాలం అక్కసుగా అన్నాడు.

'మా సుబ్బులు' బంగారయ్య విశద పరిచాడు.

'మీ సుబ్బులా?' అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడేగాని సారంగపాణికి అసలు సంగతి కొంత అవగాహన అయింది. సుబ్బులు యింటిదగ్గర, లేదన్నమాట. ఎక్కడికి వెళ్ళింది? ఎందుకు వెళ్ళింది? తను పంపిన ఉత్తరం సుబ్బులుకు అందలేదా? శరీరంలోంచి ఒక ప్రాణం లేచిపోయి నట్లైంది.

సుబ్బులు బంగారయ్య కుమార్తె.

సారంగపాణి బరువుగా నిట్టూరుస్తూ 'అయితే సుబ్బులు యింటిదగ్గరలేదా?' అన్నాడు.

ఈసారి బంగారయ్య కస్సుమన్నాడు. కారులో టాపు కొట్టుకునేంతగా యెగిరి పడ్డాడు. కళ్ళలో సాధ్యమైనంత కోపాన్ని నిలుపుకుని చూపుల్లో కురిపించాడు. 'మేమంత వెర్రివాళ్ళమనుకోకు మేష్టారూ! చేసినపని చేసినట్లు ఒప్పుకోక నంగనాచిలా

జ్యోతి

మాట్లాడ్తావేం? నీ నాటకాలు నాదగ్గరకాదు. నిన్ను నమ్మి, అభిమానించి, దగ్గరకుతీసి, ఆదరించినందుకు తలవంపుచేశావయ్యా. పాలు త్రాగినా పాముకోరల్నే పెంచుకుంటుందట. నిన్నేంచేస్తేమటుకు పాపముంది?'

'బంగారయ్యగారూ! మీరనేదేమిటో బోధపడటంలేదు. ఇందులో నా నేరమేం వుందని?'

సారంగపాణి సమాధానాన్ని వినిపించుకోకుండానే బంగారయ్య తిరిగి అన్నాడు. 'పెళ్ళి అయినవాడివి. పెద్దమనిషివి. నీకిదేం పొయ్యేకాలం? పెళ్ళికాని పిల్లను, పరువుగల కుటుంబాన్ని అల్లరిపాలుచేసి నీవు బావుకునేదేమిటి? ఇప్పటికైనా చెప్తావా అమ్మాయిని ఎక్కడుంచావో?'

'అయితే నన్ను అనుమానిస్తున్నారన్న మాట'

'పిచ్చివాడా! నీ సంగతి అంతా తెలిసింది. ఇంకా ఎందుకు ముసుగు? నీకూ అమ్మాయికీ మధ్య ఉత్తరాలు మోసిన అక్కమ్మ అంతా చెప్పింది.'

అక్కమ్మ బంగారయ్య యింట్లో పనిమనిషి. అక్కమ్మ సుబ్బులుదగ్గర్నుండి ఉత్తరాలు మోసుకొచ్చినమాట వాస్తవమే. వాటికి తగినసమాధానాల్ని తాను అక్కమ్మ ద్వారా పంపటంకూడా నిజమే. అయితే తను దోషిమాత్రంకాదు. అది నిప్పులాంటి నిజమే అయినా ఒక పట్టాన బయటపడదు. తను చెప్పినా నమ్మరు. నిదర్శనం చూపటానికి తను అసమర్థుడిప్పుడు పరిస్థితు లను కూలంచి నిప్పులాంటి నిజం గప్పుమనే వరకూ తనీ నిందను మోయవలసిందే.

'బంగారయ్యగారూ! మీరు అపోహపడుతున్నారు. నేనేపాపం ఎరుగను. మీసుబ్బులు

మాయమవటానికి నేను కారకుణ్ని గాదు. విశాల! మీరిది నమ్మరు. దోషిని నేనేనని మీరు అనుమానిస్తున్నారు గనుక మీ కుమార్తెను వెతికి మీ కప్పగించే బాధ్యత నాకున్నది. అలా వప్పగిస్తాను. అవకాశ మివ్వండంది'

గోపాలం గలగలా నవ్వాడు. అంతలోనే కోరగా చూస్తూ 'ఈ గోపాలం చేయి కబంధహస్తం. ఈ చేతిలో పడ్డవాడెవడూ తప్పించుకుపోలేడు. తప్పించుకోటానికి వ్యర్థ ప్రయత్నాల్ని చేసి మమ్మల్ని విసిగించకండి మేష్టారూ!' అన్నాడు హెచ్చరికగా వేలుచూపిస్తూ.

బంగారయ్య మాట్లాడలేదు. గోపాలం మాటల్ని సమర్థిస్తున్నట్లు మౌనంగా కూర్చున్నాడు.

సారంగపాణి అన్నాడు "నన్ను మీరు విడిచిపెట్టనవసరంలేదు. మన మంతా కలిసే వెతుకుదాం. సుబ్బులు కనపడేవరకూ నేను నిద్రాహారాల్ని విసర్జిస్తాను. కారు పోనీయండి" కారు వేగాన్ని అందుకుంది.

● ● ●

"మాధవీ! మాధవీ!"

తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా నిలిచిన వ్యక్తినిచూసేసరికి మాధవి ఆశ్చర్యపోయింది. వంటినిండా నగలతో. రేగిన జుట్టుతో. చేతిలో సంచీకూడ లేకుండా వచ్చిన సుబ్బులు మాధవినిచూసి చిరునవ్వు నవ్వింది.

"సుబ్బూ! నీవా! రా లోపలికి. ఏమిటీ ప్రత్యక్షం? ఎప్పుడొచ్చావు వూరునుంచి?" ప్రశ్నలవర్షం కురిపించింది మాధవి.

"ఇప్పుడే రావటం. నిన్నటినుండీ గమ్యం లేకుండా ప్రయాణం చేస్తూనే వున్నాను. వివరాలు తర్వాత చెప్తా. ముందు నన్ను విశ్రాంతి తీసుకోనీ." మాధవి మాట్లాడలేదు. ఎందుకో ఆమె గుండెలు గుబగుబలాడినాయి. స్నేహితురాలు ఏదో సాహసమే చేసిందనిపించింది. వెంటనే స్నానానికి. భోజనానికి కావలసిన ఏర్పాట్లన్నీ స్వయంగా చూసింది.

సుబ్బులు విశ్రాంతిగా మేను వాల్చింది "మళ్ళీ సాయంత్రం నాలుగ్గంటలదాకా నిన్ను డిస్టర్బ్ చేయనులే. కరువు తీరేవరకూ విశ్రాంతితీసుకో" అని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది మాధవి. సుబ్బులు తలుపు గడియపెట్టి వచ్చి పడుకుంది.

నిద్రపోదామని కళ్ళు మూసుకుందో లేదో మేష్టారు ప్రత్యక్షం. ఆశ. ఆనందమూ. ఆశ్చర్యమూ ఒకదానివెంట ఒకటి మనసులో ఉద్భవించి కళ్ళు తెరవమని బలవంతం చేశాయి. కళ్ళు తెరిస్తే అంతా కల్ల. భారంగా నిట్టూర్చింది సుబ్బులు. మేష్టారిమీద కోపం వరదలా ముంచుకొచ్చింది. మనసు బుసలుకొట్టింది. బుద్ధి హెచ్చరించింది. "పాపం మేష్టారేం చేశాడు నిన్ను?"

మనసు జవాబు చెప్పింది. 'ఏంచేశాడా! ఏం చేయాలో అదే చేశాడు. షివ్రలిలేని మొగవాడిహృదయం పిరికితనపు జన్మస్థలం. దుర్బలత్వాన్ని. చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోటానికే నీతి. గౌరవం అనే ముసుగులు ఉపయోగిస్తాయి. ఛీ! అలాంటి మగవాడిమీద ఆశలు పెంచుకున్న ఏ స్త్రీ బాగుపడింది?'




మండువేసవిలో మలయానిలంలాగా జాలికెరటం ఒకటి అటువేపుగా వచ్చింది. 'పాపం. మేష్టారు అమాయకుడు. తప్పంతా నాదే. నాదికూడాగాదు. ఈ మాధవిది' అనిపించింది సుబ్బులుకి.

'నాదా?' కలగా ప్రశ్నించింది టేబులుమీద మాధవి ఫొటో.

'ఆ నీదే! ఆరోజు నీవామాట అనకుండా ఉన్నట్లయితే యింతకథ జరిగేదేనా?'

ఆరోజు అంటే మేష్టారు సుబ్బులుకి సంగీతపాఠం మొదలెట్టేరోజు. మాధవి అక్కడేవుంది. 'శ్రీ గణనాథా' అంటూ పిళ్ళారిగీతాలు మొదలెట్టి చెప్తుంటే తను సరిగా పలుకలేకపోయింది. మనసుఎక్కడో సంచరిస్తుంటే దానిసేవకులైన నయనాలు మేష్టారి చుట్టూ ప్రదక్షిణాలు చేశాయి. ఫలితంగా పల్లవికూడ ఆ రోజు పూర్తిచేయలేకపోయారు మేష్టారు. ఆ నాటికి పాఠం చాలించి "రేపట్నుంచి రెగ్యులర్‌గా చెప్తుంటాం లె"మ్మని వెళ్ళిపోయా రాయన. తను మాత్రం బొమ్మలాగా అలాగే కూర్చుండిపోయింది. ఎందుకో లేవాలనిపించలేదు. మేష్టారు అటు వెళ్ళటం - మాధవి యిటు రావటం ఒకేసారి జరిగాయి. మాధవి భుజంతట్టి పలకరించేవరకి ఉలిక్కిపడింది తాను. అప్పు డంది మాధవి "మేష్టారు యిక్కడికొచ్చిందెందుకో తెలుసా? నీకు



పాఠం చెప్పటానికి. పెళ్ళిచూపులకి గాదు. ఆయనవేపు అలా పిచ్చిగా చూడటమే కాకుండా ఆయన నీలాగా నీ వైపు చూడ లేదని బాధపడుతున్నట్లుగా వున్నావ్!"

తను సురసురా చూసి "మేష్టారి గొంతు బావుంటుంది కదూ!" అంది మాటమారుస్తూ.

"కలర్ కూడా. కదూ!" మాధవి నవ్వి మళ్ళీ అంది. "ఇదుగో పిల్లా! ఎర్రగా బొద్దుగా ఉన్నాడుగదా అని వెర్రిమొర్రిగా ప్రవర్తించకు. సంగీత విద్వాంసులు సహజంగా సరసులూ, రసికులూ అయివుంటారు" పరిహాసాని కన్న మాధవి హెచ్చరిక తనకు నిజంగానే మేలుకొలుపైంది. వసంతుడి రాజ్యం ప్రారంభమైంది. పల్లవక్షి గళంవిప్పి పాడింది. నెమలి పురివిప్పింది.

రాలని సెకం కరిగించే శక్తి సంగీతానికి వుందిట. అదేమోకాని. స్త్రీహృదయాన్ని మాత్రం వెన్నలా కరిగిస్తుంది. సంగీతం దీపపు కళిక ఐతే ఆ జ్వాలకి కరగి తనను కరిగించిన జ్వాలకే ఇంధనంగా ఉపయోగపడే మైనపు ముద్ద స్త్రీ. ముఖ్యంగా సుబ్బులు లాంటి స్త్రీ. మేష్టారు తంబురా మీటుతూ పాఠం చెపుతుంటే తను వెర్రిగా చూసేది ఆయనవేపు. ఆ కళ్ళతోనే నవ్వేది. పలుకరించేది. మేష్టరుకూడ తన పలుకరింపులకు నవ్వులకు ప్రతిగా పలుకరించేవారు. నవ్వేవారు. లేక అలా నటించారో! సంకల్పానికి సహకారం లభించినప్పుడు మనసు తీగలు సాగక ఏం చేస్తుంది! లతలాగా అల్లుకపోవాలనిపిస్తుంది సుబ్బులుకి. అతని గానంలో తన్మయమై, అతని చూపుల్లోనుంచి అతనిలో అంతర్లీనమైపోవాలనిపిస్తుంది. చివరకు ధైర్యంచేసి లేఖద్వారా తన బాధను వ్యక్తంచేసుకుంది. మేష్టరు దానికి సమాధానమే యివ్వలేదు. మళ్లా వ్రాసింది. మేష్టరు జవాబువ్రాస్తూ "నీవు వ్రాసిన ఉత్తరం చేరింది. ఉత్తరం వ్రాయవలసిన అవసరమేం వచ్చిందో అర్థంకాలేదు. నేను రోజూ పాఠం చెప్పటానికి వస్తుంటానిగదా! ఏమైనా చెప్పదలిస్తే అప్పుడే చెప్పవచ్చును గదా. సముఖంలో రాయటారాలా? సముఖంలో మాట్లాడటానికి భయమా సిగ్గా? భయం తండ్రిదగ్గర. సిగ్గు భర్త దగ్గర. నేను నీకు గురువును. నీ శ్రేయస్సును. మంచిని కాంక్షించేవాడిని. అందుకే నీ వుత్తరం చదవకుండానే నీకు సమాధానం వ్రాయకలుగుతున్నాను. అర్థంచేసుకుంటా వనుకుంటాను" అని వ్రాశాడు.

తన ఉత్తరం చదవకుండానే సమాధానం వ్రాయట మేమిటో అర్థంకాలేదు సుబ్బులుకి. తన ఉత్తరం చదివితే మేష్టరు యిలా వ్రాయనే వ్రాయరు అనిపించింది. అందుకని మళ్ళా ఉత్తరంరాసి పనిమనిషి అక్కమ్మ చేత పంపుతూ 'దీన్ని చదవకపోతే చచ్చిపోతానంది' అని చెప్పమంది.

మేష్టారి రెండో సమాధానం సుబ్బులి ఆశలమీద చన్నీళ్ళు చల్లింది. దాన్ని చదువుకున్న సుబ్బులు కుప్పలా కూలింది. 'సుబ్బులూ! నీ ఉత్తరం చదివాను. ఎండలో నడుస్తూ పచ్చద్దాల చలువకళ్ళజోడు పెట్టుకుంటే ప్రపంచమంతా పచ్చగా కనిపిస్తుంది. అంతమాత్రంచేత ప్రపంచం పచ్చగా ఉంటుందని అనుకోము. అలాగే కాముకత ఆవరించిన నీకళ్ళకి నాకళ్ళలో, కదలికలో చపలత్వం గోచరించిందంటే అందుకు నేనా బాధ్యుడ్ని? తెలిసీ తెలియని వయసులో పిల్లలకు చెడు అలవాట్లు పట్టు





బడుతుంటాయి. కొన్నిటిని ఆదిలోనే త్రుంచి వేయాలి. కొన్నిటిని మాత్రం సమయం వచ్చేవరకూ ఆపాలి. ఈలోగా ఆ అలవాటుద్వారా కొంత మంచిని సాధించాల్సి ఉంటుంది. నీ విషయంలోకూడా అలాగే జరిగింది. నీ మనసును నేను మొదట్లోనే కనిపెట్టాను. అయితే అప్పుడే నేను బయటపడితే నీకు పాఠాలు ఆగిపోవటమే గాకుండా నా జీవనోపాధి పోతుంది. అందుకని యిన్నాళ్ళూ నీ మనసుకు అనుగుణంగా నడుస్తున్నట్లు నటిస్తూ కాలం గడిపాను. నీకు శిక్షణ పూర్తి అయింది. నాబాధ్యత కొంత తీరింది. నాకు భార్యావియోగం కలిగి సంవత్సరం కావస్తున్నా మీ నాన్నగారు రెండోవివాహం చేసుకోమని వత్తిడి చేస్తున్నా నాకా తలంపు కలుగనేలేదు. ఇక కలుగదుకూడా. అందుచేత నీ అభ్యర్థనను అంగీకరించలేనని తెలుపుటకు చింతిస్తున్నాను. నా యీ వుత్తరం నీ ఆశలకు అఘాతమే కావచ్చు. కాని గత్యంతరం లేదు. పరిస్థితులు ఇంతగా విషమించినప్పుడు నేనింకా ఈవూళ్ళో వుండటం నీకూ నాకూ క్షేమదాయకం కాదనుకుంటాను. అందుకే నేను త్వరలోనే ఈవూరువదలివెళ్తున్నాను. మరోచోట ఉపాధి కల్పించుకునేందుకు ఈరోజే వెళ్ళ ప్రయత్నిస్తాను. ఈవుత్తరం నీకందేసరికి నే నీవూళ్ళో ఉండనుగాబట్టి నా ప్రయాణాన్ని ఆపే ప్రయత్నం పెట్టుకోకు. నన్ను మర్చిపో!.

గబగబా లేచి స్టేషనుకు పరుగెత్తింది సుబ్బులు అప్పటికే రైలు వెళ్లిపోయింది. మేష్టరు అంత హఠాత్తుగా వెళ్ళిపోవటానికి కారణం తనేనా అనిపించింది సుబ్బులుకి. తనుమాత్రం ఏం తప్పుచేసింది! రెండు సంవత్సరాల పరిచయంలో మేష్టరి హావభావాల్ని వేరొకవిధంగా అర్థంచేసుకుని. తనతో వివాహానికి సుముఖుడుగా ఉన్నాడని అపోహపడింది. తన అభిమతాన్ని వ్యక్తం చేస్తూ అలా వుత్తరం రాయటంలో తొందరపడింది. ఏ స్త్రీకూడా అలా ముందడుగు వేయదేమో. అందుకు కారణంకూడ లేకపోలేదు. భార్యావియోగానంతరం మేష్టర్ని నాన్నగారు 'మళ్ళీ వివాహం చేసుకోండి' అని రెండుమూడుసార్లు చెప్పినపుడు 'చూద్దాంలెండి బంగారయ్యగారూ!' అని మేష్టరు సమాధానం చెప్పటం తను విన్నది. అందుకే మేష్టరు మళ్ళీ పెళ్ళి చేసుకోటానికి సుముఖుడుగా వున్నాడని తలచి అంత చొరవ తీసుకుంది.

స్టేషన్లో ఇటు వెళ్ళేబండి కదలబోతోంది. ఇంటికి పోవటానికి మనసొప్పని సుబ్బులు అప్రయత్నంగా రైలు ఎక్కింది.

మాధవి అంతా విన్నది. విని "ఎంత పొరపాటుచేశావు సుబ్బులూ!" అంది.

"ఏం?"

"నీ విలా రాకుండా ఉండవలసింది."

"......................"

"మేష్టరు ఎక్కడికో వెళ్ళారు. నీ విటు వచ్చావు. ఇప్పుడు మీ వూళ్ళో అందరూ ఏమనుకుంటారో తెలుసా! సుబ్బులు మేష్టరితో లేచిపోయిందనుకుంటారు. పోలీసు రిపోర్టు యిస్తారు. వెతికి వెతికి మేష్టర్ని పట్టుకుని "మా అమ్మాయిని ఎక్కడదాచావో చెప్పమని బాధిస్తారు. పాపం ఆయన ఎంతగా బాధపడ్తారో! అవమానం ఒకవేపు. బాధ మరోవేపు."

మాధవి ఊహా అసమంజసంగా తోచ లేదు సుబ్బులుకి. కాని తానుగా చొరవ తీసుకుని తన హృదయాన్ని అర్పణ చేస్తానని ముందుకు వచ్చినా, తనేదో తప్పుగా ప్రవర్తించినట్లు అర్థంచేసుకుని, ఇలా తనను తిరస్కరించి అవమానించినందుకు ఆయన కూడ ఇలా అవమానం పొందాల్సిందే నని పించింది. అంతలోనే, తనకోసం మేష్టరు పడిన శ్రమ, యిష్టమున్నా లేకపోయినా, తనమీద ప్రేమ వున్నట్లు నటిస్తూ, తన సంగీతాభ్యాసం పూర్తిచేసిన మేష్టారిపై గురు భావం ఉదయించి నిజంగానే ఆయన అనవసరంగా అపోహలకు, అవమానానికి గురి యౌతారేమోనని నొచ్చుకుంది. తానిక ఉపేక్ష చేయకూడదని, అకారణంగా ముంచుకువచ్చిన మంచుతెరల్లాంటి అపోహానుమానాల్ని చెదరగొట్టాలని అనుకుంది. కర్తవ్యం బోధపడినా అందుకు అవలంబించవలసిన మార్గంకోసం గాఢంగా ఆలోచించింది.

స్నేహితురాలిలో వచ్చిన పరివర్తనను మాధవి అర్థం చేసుకుంది. గాఢంగా నిట్టూరుస్తూ "అయితే పద" అంది.

● ● ●

తిరిగి తిరిగి యిల్లు చేరిన బంగారయ్య, గోపాలం, సారంగపాణి ఇంట్లో సుబ్బులు కనిపించేసరికి ఆశ్చర్యపోయారు. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. సుబ్బులు తల దించుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఉసురుసురుమంటూ కుర్చీలో కూలబడిన బంగారయ్య నుద్దేశించి మాధవి అంది

"ఏమిటండీ బాబాయిగారూ! ఏదో హడావిడి చేశారుట?"

బంగారయ్యకు ఏం మాట్లాడాలో తోచ లేదు.

మాధవే మళ్ళీ అంది. "సుబ్బులూ నేనూ ఉదయం వచ్చేసరికి ఊరు ఊరంతా కాకిగోలగావుంది. మనిషి కనపడక పోయినంతమాత్రంచేత యిష్టమొచ్చినట్లు ఊహాగానాలు చేసుకుని అభాండాలు వేయటమేనా? లోకం గ్రుడ్డిదై కారుకూతలుకూస్తే సరిదిద్దవలసిన మీలాంటివారే యిలాచేస్తే వేరే అనుకోవలసిన పనేముంది? ఛీ-ఛీ సిగ్గుచేటు."

"అయితే నిజంగా సుబ్బులు నీ దగ్గర కొచ్చిందా" అనుమానంగా ప్రశ్నించాడు బంగారయ్య.

"అయితే నేను అబద్ధాలు చెపుతున్నానంటారా? కావలిస్తే మా ఇంట్లో విచారించి రండి విజయవాడ వెళ్ళి."


"ఇంట్లో చెప్పకుండా ఎందుకు వచ్చిందిట?"

"ఇదుగో ఇలా రాద్ధాంతం చేదామని" వ్యంగ్యంగా అంది మాధవి.

తను వేసిన ప్రశ్నకు సమాధానం సరిగా రాలేదని గమనించలేదు బంగారయ్య. మరో అనుమానం ఆయన్ను పీడిస్తూండటంవల్ల. అదీ అడిగేశారు "మరి అక్కమ్మ అలా చెప్పిందేం?"

'అక్కమ్మ కాదది. తల తిక్కమ్మ. "రేపు ఊరికెళ్తున్నాను కాబట్టి రేపు పాఠం చెప్పటానికి రావొద్దు" అని చీటీ వ్రాసి





పంపింది సుబ్బులు మేష్టరుకు. అంతకు ముందే మేష్టరు కూడా ఏదో పనిమీద వూరికి వెళ్ళే ప్రయత్నంలో ఉండటంవల్ల అసంగతే జవాబుగా వ్రాసి, తాను రెండు మూడురోజుల వరకూ రానని కూడా తెలియజేస్తూ చీటీ వ్రాసి పంపారు మేష్టరు. ఈ చీటీలని చూసి అనుకోవలసిన విధంగా అనుకుని మీతో చెప్పింది అక్కమ్మ' మాధవి చెప్పటం ముగించింది.

అల్పలోహంతో మేలిమి బంగారానికి వన్నె, గట్టిదనం వచ్చినట్లుగా సత్యం, అసత్యం సమపాళ్ళలో కలిసిన అసత్యం సత్యంకంటె యెక్కువగా భాసిస్తుంది.

'బంగారయ్యగారూ! నా కిక శెలవిప్పించండి' అంటూ చేతులు జోడించాడు సారంగపాణి. సారంగపాణి వైపొకసారి తీక్ష్ణంగా చూసి మేడ మీదకి వెళ్ళాడు గోపాలం. సారంగపాణి బరువుగా వీధి వాకిలి వైపు కదిలాడు.

"మేష్టరూ! మేష్టరూ!!' బంగారయ్య పిలుపు సారంగపాణికి వినిపించకపోలేదు.

మేడపైన రేడియోలో వినిపించే మోహన రాగం మెట్లుదిగుతూవచ్చి పంచమస్వరంలో ఆగిపోయింది.

□□□